# బండిచక్రం

ఆకాశంకింద నడుస్తున్నాను. రాళ్ళూ రప్పలూ కాళ్ళకింద దొర్లుతున్నాయి. పాదాలకు జోడులేదు. కంకరరాళ్ళు గుచ్చుకుంటున్నాయి. బాధనిపించడంలేదు. చచ్చేవాడికి బాధేమిటి? అందుకే నడుస్తున్నాను. అర్థరాత్రి చీకట్లో ఎవరూ వుండనివైపు డొంకల్నీ, రాళ్ళ గుట్టల్నీ దాటుకుంటూ నడుస్తున్నాను. ఎదురుగా నక్షత్రం ముసుగేసుకొని ఏడుస్తోంది చస్తానని కాబోలు!

చెట్టుమీద గూట్లో పక్షిపిల్లలు 'మేం చూస్తున్నాంసుమా' అన్నట్టు రెప్పలు రెపరెపలాడించాయి. చూస్తే భయమేమిట్లే నాకు. ఆ భయమేగాని వుంటే ఎందుకు చావాలని బయలుదేరుతాను? భయం భక్తీ వుంటే అలా చేస్తానా? ఉగ్గుపాలతోనే అలాటివి అలవడలేదు. 'అదిగో బూచి' అని భయపెట్టే అమ్మకూడా ఆ తర్వాత లేకుండా పోయింది. చస్తానన్నా ఆపేవాళ్ళు లేరిప్పుడు. అనుకోవడమేమిటి, అనుకుని బయలుదేరినా ఆఖరికి ఆదేవుడుగూడా ఆపకుండా తిన్నగా యిక్కడికే తీసుకువచ్చాడు!

అదిగో! దూరంగా కాలవ కనిపిస్తోంది. నన్ను వేలెత్తి చూపించేవూరు-నన్ను అప్రయోజకుడ్నని, అసమర్థుడ్నని చాటిన వూరు-నావెనక చెట్లల్లో చీకట్లో దాక్కుని తొంగితొంగి చూస్తోంది- మళ్ళీ నేను వెనక్కి తిరిగి వచ్చేస్తానేమోనని.

ఛీ....ఆ కుక్కబుద్ధి నాకు లేదు. దానిలా నా గుండె పాషాణం కాదు. ఇంత అన్నం నాకు పెట్టమంటే పెట్టలేదది. వట్టినేకాదు, పనిచేస్తానన్నా నావైపు చూడందే! అందుకే చస్తానన్నాను. చచ్చిసాధించేది లేకపోయినా బతికిబాగుపడ్డదేదీ? భవిష్యత్తులో

బాగు వుందనుకుంటూనే యీ పాతికేళ్ళూ ఎదురుచూశాను. నాలో మార్పులేదు, ఒక్క ఆకారం భారీ ఎత్తున ఎదగడం తప్ప! దాన్ని పోషించడం భారంగా వుంటోంది.

మూడేళ్ళుగా కాళ్ళు అరిగిపోయేట్టు తిరిగాను. నన్ను నేను పోషించుకోడానికి. అడ్డమయిన చాకిరీ చేశాను. నాకు వ్యక్తిత్వం, గౌరవం, మర్యాద అనేవి వున్నాయనికూడా ఆలోచించుకోలేదు:

ఎవరూ నన్ను పేరెట్టి పిలిచేవారుకాదు. పిలిచినా నన్ను కాదనుకొని వెళ్ళిపోయేవాడిని-ఎప్పుడూ అలవాటులేదుగనుక. 'ఏరా' అన్నారు-జనం తమతమ బట్టతలల్నీ, బుట్ట తలల్నీ వేళ్ళతో బుజ్జగిస్తూ. రోజులతరబడి సంస్కారంలేని బట్టల్లో, గెడ్డంలోవున్న ఆకారానికి అంతకన్నా గౌరవం యివ్వడం వాళ్ళ హోదాకే భంగం అని నాకు తెలుసు.

మనసూ, శరీరం రెండూ విసిగిపోయాయి. ఆకలీ, కోరికలూ ఎడారిలోని నీళ్ళలా యింకిపోయాయి. అందుకే అర్ధరాత్రి ఖాళీపొట్టతో కాళ్ళీడ్చుకొంటూ బయలుదేరాను. ఆఖరిసారి నాయిల్లు-సొంతదని ఎల్లా అనుకోను? పదినెలల్నుండి అద్దె యివ్వనేలేదు-దాని కప్పునీ, స్తంభాల్నీ, అరుగుచివర నే దొర్లే ప్రదేశాన్నీ చూసి విడవలేక విడవలేక గుండె రాయిచేసుకొని వచ్చేశాను. వచ్చేస్తోంటే యింటి ముందున్న వేపచెట్లో కొమ్మలు కదిలాయి. పక్కింట్లో అప్పుడే పుట్టిన పసిపిల్ల కేర్‌మంది. నేను అరుగుదిగేవేళ వీధి చివర గుడిగోపురం గూడులోవుంటున్న గుడ్లగూబ అరిచింది.

కాళ్ళు కాలవగట్టును వెతుక్కుంటూ కదుల్తున్నాయి. ఇదేమిటి! చూస్తుండగానే గట్టు వచ్చేసింది! గట్టుమీద నుంచున్నాను నాకు తెలీకుండానే.

వరదకాలం. గట్లను కోసుకుంటూ ఎర్రనీరు గట్టు అంచువరకు ప్రవహిస్తోంది. గట్టిగా శబ్దంచేసుకుంటూ మట్టి గెడ్డలు తెగి నీళ్ళల్లో పడుతున్నాయి. చూసుకొంటూ నడుస్తున్నాను. పొలిమేరదాటి, అరమైలు దూరం పోవాలి. అక్కడ ఎవరూ వుండరు. దీపాలుకూడా వుండవు. చీకటి రాజ్యంచేస్తూ వుంటుంది. నామీదా చీకటి ముసుగు వాలుతుంది. ఎవరికంటాపడే ప్రమాదం లేదు.

గబగబా నడుస్తున్నాను-అడుగులు పెద్దవివేస్తూ. సాధ్యమైనంత వేగంగా అక్కడకు చేరుకోవాలని నడుస్తున్నాను. కాలికేదో గట్టిగా తగిలింది! ఖంగుమని శబ్దంచేసింది! గుడ్డిగా కునుకుతున్న కోడిపెట్టలా యిరవై గజాలదూరంలో ఆఖరి మునిసిపాలిటీదీపం వెలుగుతోంది. ఆ మసక వెలుతుర్లో అయిదడుగులు నాచుట్టూరా

వెతికాను. మనీపర్సు ఎండిన ఆకులకింద దూరి కూర్చుంది! తీసి లాంతరు స్తంభంకింద విప్పాను. రెండు రూపాయల చిల్లర, మూడు పది రూపాయిల నోట్లు, మరో అయిదురూపాయల కాగితం భద్రంగా వున్నాయి-ఒకదాన్నొకటి పరామర్శించుకొంటూ.

కళ్ళు జిగేల్‌మన్నాయి.

గబుక్కున తీసి జేబులో దాచాను.

ఎందుకూ దాయడం?-

ఏమో! దాయాలనిపించింది.

నా పిచ్చిగాని చచ్చేవాడికి డబ్బెందుకు? కావాలనుకున్నప్పుడు దొరకగూడదూ? అన్నీ తెగించి చద్దామని వస్తే యిప్పుడా కనిపించడం!... లాభంలేదు, ముందటి నిర్ణయానికి తిరుగులేదు. వెధవది...ఆ రూపాయలతో ఓ పదిరోజులు తింటే ఆ తర్వాత-మళ్ళీ పాతగతే! ఎంగిలి మెతుకులకోసం కక్కుర్తి! ఇన్ని మెతుకులకోసం వెతుక్కుంటూ కుక్కమూతిపెట్టుకుని ఊరల్లా తిరగాలి! అప్పుడు మళ్ళీ చావాలనిపించకపోతే జీవితంనిండా చీవాట్లు, ఎంగిలిమెతుకులు!

గట్టుకు యీవలివైపు దూరంగా తుప్పల్లోకి బలంకొద్దీ పర్సు విసిరిపారేసాను. మళ్ళీ లాంతరు వెలుతుర్ని దాటుకుంటూ చీకట్లోకి నడక. ఓపాము నా నడక శబ్దానికి భయపడి తుప్పల్లోకి పారిపోయింది!

'ఏం...అది కాటెందుకు వేయకూడదు? నేనంటే దానికి భయందేనికి?'

వెకిలిగా నవ్వుపుట్టుకొచ్చింది. నవ్వుకుంటూ పోతున్నాను. గట్టుపక్క దొమ్మరివాళ్ళ పాకలు. పాకల్లో దీపాలు మినుకుమినుకు మంటున్నాయి. పాకల్లో జీవులు నిద్రపోతున్నారు గాబోలు, పాకల చుట్టూ నిశ్శబ్దం కావలించుకుని పడుకుంది.

పాకలమధ్య తలారబోసుకున్నట్టుగా మర్రిచెట్టు నిల్చునివుంది. చెట్టుకింద నేలమీద ఏదో ఆకారం తెల్లగా కదుల్తోంది. భయంకలగలేదుగాని ఆగిపోయాను. నేనాగిపోవడంచూసి అదీ కదలడం మానేసింది. నిదానించి చూస్తోంది నావైపు.

మెల్లగా దగ్గరకు వెళ్ళాను. స్త్రీ! ఇరవై ఏళ్ళున్నాలేవు. నన్ను చూసి చిన్నగా నవ్వుతోంది. చీకట్లో పెదాలమధ్య పళ్ళు తెల్లగా మెరిసాయి! కళ్ళు జిగేల్‌మన్నాయి. ఓమారు ఒళ్ళంతా కదిపింది. ఉబికిన వక్షాలు అల్లల్లాడాయి. గట్టుమీద వెనక్కు చేతులు అన్చివంగి గట్టిగా ఊపిరితీసి కూర్చుంది. ఎదురురొమ్ములు చీకట్లను గుచ్చు

కొంటున్నాయి. తలలోనివి మల్లెపూలుకాబోలు సువాసనలు కాలవగాలిలో కలిసి చుట్టూరా గెంతుతున్నాయి.

రమ్మన్నట్టుగా చేతులు ఊపింది. నిశ్శబ్దాన్ని చీలుస్తూ గాజులు గలగలమన్నాయి. ఆ శబ్దానికి చెట్టుమీది పక్షి,రెక్కలు రెపరెపలాడించుకుంటూ ఎక్కడికో ఎగిరిపోయింది. చెట్టుకింద సన్నగడ్డిమెల్లగా అదిరింది. కాలవనీళ్ళు గలగలలాడాయి.

వినిపించుకోకుండా గట్టెక్కాను. అడుగుతర్వాత అడుగేస్తూ నడుస్తున్నాను. నన్ను అనుసరిస్తూ నావెనకాలే వస్తోంది! కొద్దిసేపట్లోనే నన్ను కలుసుకొని నా చేతిని తన చేతుల్లోకి తీసుకుంది. దూదిలా మెత్తగా తగిలాయి వేళ్ళు.

"రారా" అంది ఆగి, ఎదురుగ్గా నుంచొని నా కళ్ళల్లోకి చూసి చిలిపిగా నవ్వుతూ.

చెయ్యి విదిలించుకుని విసుగ్గా రెండడుగులువేసాను.

మళ్ళీ సంకెళ్ళు తగులుకున్నాయి.

"ఎక్కడికి...రాండీ" అంది.

అలా ఎవరు పిలిచారు నన్ను? అంత ఆప్యాయత ఉట్టిపడుతూ రమ్మన్నదెవరు? అంత ప్రేమ ఒలకబోసి, అంత గౌరవం యిచ్చి నన్ను పలకరించిన వాళ్ళెవరు? రమ్మనకపోయినా పోనీలే అని వెడితే 'వెధవా పో' అని అంతా కసిరికొట్టిన వాళ్ళేకదా.

"ఇంత రాత్రప్పుడు ఎక్కడకు వెళ్తారు! అలా పోయి మా గుడిసెదగ్గర కూర్చుందాం. ఇంకా అవతలకు వెళ్తే పురుగూపుట్రా ఏమయినా వుంటాయి" అంది.

కదలకపోయినా వెనక్కు వెనక్కు బలవంతంగా లాగుతోంది నన్ను.

ఆమె భయానికి నవ్వొచ్చింది. పురుగూ పుట్రా చూసి భయపడతాననుకొంది కాబోలు! అలాంటివి వందొచ్చి కాటేసినాభయంలేదిప్పుడు. అందుకేగా యింటిదగ్గర నుండి యిలా రావడం, కాకపోతే కాలవలోకి దూకి చద్దామనుకున్నాడు తను.

ఆమె మళ్ళీ చేతుల్ని పట్టుకుని లాగుతోంది.

మనసు కొద్దికొద్దిగా లొంగిపోతోంది. కాని చచ్చేవాడికి యివన్నీ ఎందుకు? మరో అయిదు నిమిషాల్లో లోకంతో సంబంధంలేనివాడికి ఎందుకీ సుఖం? ఆఖరిసారి ఆనందించిమరీ చావమనా? ఇన్నేళ్ళనుండీ లేనిజీవితానికి ఆఖరి క్షణాల్లోమాత్రం ఎందుకు?

బలంగా ఆమెను వెనక్కునెట్టి పరుగెత్తాను. పదడుగులు వెళ్ళకముందే

రాయితగిలి తూలిపోయి గట్టుమీదనుండి దొర్లుకొంటూ కిందపడ్డాను. బండరాయి గాబోలు బలంగా తలకుతగిలింది. బాధతో మూలిగి దెబ్బతగిలినచోట తడుముకున్నాను. తడిగా ఏదో తగిలింది. రక్తం కాబోలు, ధారలుగా కారి బట్టల్నీ, శరీరాన్నీ తడుపుతోంది.

ఆమె పరుగెత్తుకొచ్చింది. మెల్లగా లేపి వెల్తురున్నచోటుకి తీసుకొచ్చింది. గాయాన్నిచూసి అదిరిపోయింది గాబోలు, పరుగెత్తుకుని వెళ్ళి పాకలోంచి ఓ గుడ్డపీలిక తెచ్చి కారిన రక్తమంతా తుడిచి తలకు కట్టుకట్టింది.

రక్తం చాలా కారినట్టుంది. ఒంట్లో ఓపికలేదు. గాయంకూడా బాధపెడుతోంది. లోపల కడుపులో ఆకలి దహించుకపోతోంది. నీరసంచేత కళ్ళు మూసుకుని అలానే బాధగా బరువుగా ఊపిరిపీలుస్తున్నాను.

"ఎలావుంది?" అంది ఆమె.

మాట్లాడలేదు నేను. మాట్లాడ్డానికి ఓపికకూడా సన్నగిల్లిపోయింది.

"మంచినీళ్ళు కావాలి" అన్నాను సంజ్ఞచేసి.

గబగబావెళ్ళి పాకలోంచి నాలుగు అరటిపళ్ళూ చెంబుతో మంచినీళ్ళూ తెచ్చిచ్చింది.

ఆతృతగా అందుకుని గబగబా తినేశాను. నేను తింటోంటే ఆమె విచిత్రంగా నావైపే రెప్పవాల్చకుండా చూస్తోంది. ఓసారి నవ్వుకుని లోపలికివెళ్ళి తినడానికి ఏవో మరికొన్ని తెచ్చింది. వద్దనలేకపోయాను. ఆత్మాభిమానం అడ్డురాలేదు. అవీ అందుకుని తిని, నీళ్ళిస్తే గడగడా తాగాను.

ప్రాణంకొద్దిగా కుదుటపడింది. మెల్లగా నడిచివెళ్ళే ఓపికవచ్చింది. లేచినుంచుని "వస్తా" అన్నాను.

జాలిగా చూస్తూ "ఊ" అంది. మెల్లగా నావెంటే కొంతదూరం వచ్చి వెళ్ళిపోయింది.

వెనక్కుతిరిగి వెళ్ళిపోతున్న ఆమెను చూస్తూ నుంచున్నాను. ఆమె ప్రేమకు, సానుభూతికి ఆశ్చర్యపోయాను. వాళ్ళల్లోనూ దయాదాక్షిణ్యాలు, ప్రేమ, అభిమానం వుంటాయా అనిపించింది. వాళ్ళంతా సంఘం తరిమేసినవాళ్ళు. అయినా వాళ్ళూ మనుషులే. వాళ్ళల్లోనూ జాలీ, కరుణావుంది. బ్రతుకుమీద ఎంతమమకారం! బ్రతుకుకోసం ఎంతతాపత్రయం! నికృష్టపు బ్రతుకు బ్రతుకుతున్నా దానిమీద ఎందుకంత

యిష్టం?

అక్కడే గట్టుపక్కన బండమీద కూచుని ఆలోచిస్తున్నాను.

నన్ను చూసి నాకే సిగ్గనిపించింది. జీవితంమీద విరక్తి, చావాలనే కోరిక-అవన్నీ పిచ్చిపిచ్చి ఊహలుగా అనిపించాయి. జీవితం నమిలిపారేసిన పిప్పి అనుకోవడం అవివేకమనిపించింది. జీవితంలో ఆనందముంది. అది అందరికీ అందుకోవడం తెలీదు. తన్నుతాను మోసగించుకుని నిరాశనికావలించుకుని వున్నంతకాలమూ అంతే. చావడమనేది శుద్ధవెర్రిపని. కోర్కెల గురించయినాసరే భూమ్మీద బతకాలి.

బద్ధకాన్ని దులుపుకుని లేచాను. తూరుపువైపు వెల్తురు చారలు చెట్లకొమ్మల్లోంచి, ఆకులపక్కనుంచి కనిపిస్తున్నాయి. కాలవవార గుడిలో గణగణమని ఎవరో గంటలు వాయిస్తున్నారు. పక్కనే నిద్రపోతున్న కుక్కపిల్ల అదిరిపడిలేచి ఓమారు ఒళ్ళంతట్నీ కదిపి తోకాడించుకుని వెళ్ళిపోయింది. ఎదుటి కాలవలో ఒకచేప పైకెగిరి దబ్బున నీళ్ళల్లోపడి మాయమయ్యింది.

మెల్లగా కాలవగట్టు వెంబడే కదిలాను. గట్టుపక్కన తుప్పల్ని గడ్డిదుబ్బుల్నీ వెతికాను. రాళ్ళూ రప్పల్నీ అన్నీ ఎత్తిచూశాను. రాత్రిపారేసిన పర్సుకనిపించలేదు. ఎండెక్కింది. ఇంకా ఆశతో వెతుకుతూనే వున్నాను. ఒక తుప్పలో ఏదో తెల్లగా కనిపించింది. పామేమోనని అదిరిపోయాను. పదిగజాలు పరుగెత్తి మళ్ళీ వెనక్కువచ్చి నిదానించి చూస్తే-ప్రాణంలేని తాడు కనిపించింది.

గట్టుదిగి ఊరివైపు బయలుదేరాను. శరీరంలో మళ్ళీ నీరసం. కడుపులో ఆకలి.

కాళ్ళీడ్చుకుంటూ ఊళ్ళోకి నడక. పొట్టకూటికోసం మళ్ళీ తాపత్రయం. చీవాట్లు, తిట్లు, ఛీత్కారాలు!